

ఎమ్మెల్సీ దక్కేనా..! 8లో ▸
ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనేది ఆసక్తిగా మారింది. ఒకటి ఎస్టీకి కేటాయిస్తామని ప్రచారం జరుగుతుండటం ఆసక్తి కలిగిస్తోంది.



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
ఆది : 6:20	సోమ : 5:13

గరిష్టం/కనిష్టం
37.5 /21.5

వాతావరణం
పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం వేడి అధికంగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

విఠోలిలో ఆర్జీయూకేటీ విద్యార్థుల శ్రమదానం



శ్రమదానంలో ఆర్జీయూకేటీ విద్యార్థులు

ముథోల్: మండలంలోని విఠోలి గ్రామంలో శనివారం ఆర్జీయూకేటీ బాసర విద్యార్థులు శ్రమదానం చేశారు. ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ ఆదేశాల మేరకు ఎన్‌ఎస్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో మూడురోజులపాటు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపును ఆర్జీయూకేటీ విద్యార్థులు గ్రామంలో నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్స్ డాక్టర్ విఠల్ తెలిపారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈవో రమణారెడ్డి, హెచ్‌ఎం రమేశ్, పంచాయతీ సెక్రెటరీ అనూషతో కలిసి విద్యార్థులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు గ్రామాలను దత్త తీసుకుని పురజలను చైతన్య పర్చడం, వివిధ అంశాలపై అవగాహన కల్పించడం , విద్యతోపాటు సామాజిక సేవ చేయడం, విద్యార్థులలో భాగమై ఉండాలని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ రమాదేవి, డాక్టర్ లకుమాదేవి, అంగన్‌వాడీ టీచర్ వనిత, మాజీ సర్పంచ్ సత్యంగౌడ్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

చుక్కల దుప్పిని రక్షించిన గ్రామస్తులు



బావిలో నుంచి వెలికి తీసిన చుక్కల దుప్పి

కడెం: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిన చుక్కల దుప్పిని మండలంలో చిట్యాల్ గ్రామస్తులు రక్షించారు. నీళ్ల కోసం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్దకు వచ్చిన దుప్పి ప్రమాదవశాత్తు బావిలో పడింది. బయటకు రాలేక కొట్టుమిట్టాడుతుండగా గ్రామస్తులు బోరె కిషన్, గుమ్ముల నరేశ్, తరుణ్, ధర్మా జీరమేశ్, కుమ్మరి పోశం గమనించి దుప్పిని బయటకు తీసి ఫారెస్ట్ సిబ్బందికి అప్పగించారు. ఫారెస్ట్ సిబ్బంది చుక్కల దుప్పిని తీసుకెళ్లి సమీప అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు.

హైదరాబాద్‌కు గ్రామీణాభివృద్ధి శాఖ బృందం

నిర్మల్‌చైన్‌గేట్: మహిళా దినోత్సవంలో పాల్గొనేందుకు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బంది శనివారం హైదరాబాద్ వెళ్లారు. షి ఇన్‌స్పైర్ ఆరవ ఎడిషన్ అవార్డుల్లో భాగంగా హైబిజ్ అవార్డును అందుకోనున్నారు. హైదరాబాద్ వెళ్లిన వారిలో డీఆర్డీవో విజయలక్ష్మి, అధికారులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు ఉన్నారు.

నేడు ప్రతిజ్ఞ దివస్

నిర్మల్‌చైన్‌గేట్: పనిచేద్దాం ప్రతిజ్ఞా చేద్దాం అనే నినాదంతో ఆదివారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద మిలియన్ మార్చ్ స్ఫూర్తిగా ప్రతిజ్ఞ దివస్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొట్టె శేఖర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమం తెలంగాణ పునర్నిర్మాణం, ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల నెరవేర్చడం, ఉద్యమకారుల ఆశలు ఆకాంక్షలు నెరవేర్చడంలో భాగంగా ఈ కార్యక్రమం తలపెట్టినట్లు వివరించారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు కోసం నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న ఖత్‌గాం గ్రామస్తులు

భైంసాటౌన్: తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని మండలంలోని ఖత్‌గాం గ్రామస్తులు శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. పట్టణంలోని ఖత్‌గాం ప్రవేశమార్గం వద్ద నిరాహార దీక్ష శిబిరం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. పట్టణం నుంచి తమ గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేదని తెలిపారు. రాకపోకలకు గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. భైంసా నుంచి ఖత్‌గాంకు, కామోల్‌కు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. దీక్షలో మాజీ సర్పంచ్ దెగ్లూర్ రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బట్టీల్లో కాలుతున్న చెట్లు

పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు అంటారు. చెట్లను పెంచాలని, పర్యావరణాన్ని పరిరక్షించాలని ప్రభుత్వాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఏటా వానాకాలం ప్రారంభంలో భారీగా మొక్కలు నాటుతున్నారు. ఇందులో ప్రజలు కూడా భాగస్వాములు అవుతున్నారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడేలా చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇదే సమయంలో భారీగా పెరిగిన వృక్షాలను కొందరు నరికివేస్తున్నారు. చెట్లను కోతకు అమ్ముకుంటున్నారు. దీంతో చెట్లు నరికే దందా చేసేవారు అనుమతి లేకుండానే భారీ వృక్షాలను రంపాలతో కోసి.. కలపను తరలించుకుపోతున్నారు. దీంతో పచ్చని చెట్టే... కట్టె.. ఇటుక బట్టీల్లో కాలి బూడిదవుతోంది.



- జిల్లాలో జోరుగా కలప దందా
- ఇష్టారీతిన వృక్షాల నరికివేత
- ఇటుక బట్టీలు, ఇతర జిల్లాలకు తరలింపు



రాత్రివేళల్లో ట్రాక్టర్‌లో తరలిపోతున్న కలప(ఫైల్)

భైంసాటౌన్: భైంసా అటవీ రేంజ్ పరిధిలో కలప దందా జోరుగా సాగుతోంది. చుట్టు పక్కల గ్రామాల నుంచి రైతుల పేరిట నామమాత్ర అనుమతులతో ఇష్టారీతిన చెట్లు నరికి తరలిస్తున్నారు. ఒకటి, రెండు వాహనాలకు మాత్రమే అనుమతి పొంది, ప్రతీరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో నాన్‌టేక్ కలపను స్థానిక ఇటుక బట్టీలతోపాటు, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు సైతం తరలిస్తున్నారు. స్థానికంగా ఉన్న సామిల్లులకు కూడా తరలించుకుపోతున్నారు. ఫలితంగా రేంజ్ పరిధిలో ఇష్టారీతిన చెట్లు నరికివేస్తున్నారు. పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది.

భైంసా కేంద్రంగా...
కొందరు నాన్‌టేక్ దందా నిర్వహకులు భైంసాతోపాటు నియోజకవర్గంలోని కుభీర్, తానూరు, ముథోల్ తదితర మండలాల్లోని గ్రామాల్లో చెట్లను నరికి ట్రాక్టర్లలో పట్టణ కేంద్రానికి తరలిస్తున్నారు. ఇలా తరలించిన కలపను ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేస్తున్నారు. కొన్నింటిని ఇటుక బట్టీలకు, సామిల్లులకు తరలిస్తునానరు. పెద్ద మొత్తంలో పోగు చేసిన కలపను ఇతర ప్రాంతాలకూ తరలిస్తున్నారు. అటవీశాఖ అధికారుల వద్ద నామమాత్ర అనుమతులు తీసుకుంటూ, పెద్ద సంఖ్యలో చెట్లను నరికి తరలిస్తున్నారు. భైంసా-నిర్మల్, కుభీర్, భోకర్, బాసర మార్గాల్లో నిత్యం రాత్రివేళల్లో ట్రాక్టర్లలో జోరుగా నాన్‌టేక్ కలప తరలుతోంది. అధికారులు పట్టుకున్న సందర్భాల్లో ట్రాక్టర్ ఇంజిన్ చెడిపోయిందని, ట్రాలీ వేరేది అమర్చినట్లు చెబుతూ తప్పించుకుంటున్నారు. అటవీశాఖలోని కొందరు కిందిస్థాయి సిబ్బంది సహకారంతోనే అక్రమదందా జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఇటుక బట్టీల్లో వినియోగం..
డివిజన్ పరిధిలోని పలు ఇటుక బట్టీల్లో కట్టెలు వినియోగిస్తున్నారు. ఇటీవల అటవీశాఖ అధికారులు దాడి చేసి కట్టెలు వినియోగిస్తున్న ఇటుక బట్టీల నిర్వహకులకు జరిమానా విధించారు. అయినా, మళ్లీ కొందరు యథేచ్ఛగా కట్టెలు వినియోగిస్తున్నారు. ఫలితంగా బట్టీల్లో నుంచి వచ్చే పొగతో రోడ్లపై వాహనదారులు, బట్టీల పరిసర ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



ఇటుక బట్టీల వద్ద కలప

చర్యలు తీసుకుంటున్నాం..
అనుమతి లేకుండా చెట్లు నరికితే చర్యలు తీసుకుంటాం. ఇటుక బట్టీల్లో కట్టెలు వినియోగించినట్లు దృష్టికి వస్తే జరిమానా విధిస్తున్నాం. నాన్‌టేక్, టేక్ అక్రమ రవాణా జరగకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. – వేణుగోపాల్, ఎఫ్‌ఆర్‌వో, భైంసా

ఈఎస్‌ఐ ధీమా!

- ఆదిలాబాద్, మంచిర్యాలలో కొత్తగా డిస్పెన్సరీలు
- అందుబాటులోకి వస్తే వైద్యం
- కార్మిక కుటుంబాలకు ఉచితంగా సేవలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలకు వైద్యం చేరువ చేసేందుకు ఈఎస్‌ఐ(కార్మిక రాజ్య బీమా సంస్థ) కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మరో రెండు డిస్పెన్సరీల ఏర్పాటుకు నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 18డిస్పెన్సరీలు ఏర్పాటు చేస్తుండగా ఇందులో ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో రెండు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్మల్ పట్టణం శాంతినగర్‌లో, మంచిర్యాల పట్టణం ఏసీసీ కాలనీలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీలు ఉన్నాయి. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రి ఉంది. నిర్మల్‌లో బీడీ కార్మికులకు ప్రత్యేకంగా మరొకటి ఉంది. ఉమ్మడి జిల్లాలో సిమెంట్ పరిశ్రమలు, మట్టి, స్పిన్నింగ్, పేపర్ మిల్లు తదితర కార్మిక వర్గాలు ఎక్కువగా ఉన్న చోట్ల ఈఎస్‌ఐ ఆధ్వర్యంలో కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటయ్యాయి. ఈ డిస్పెన్సరీ, ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది ఖాళీలతో అరకొర వైద్యమే అందుతోంది. అంతేగాక సొంత భవనాలు లేక అద్దె భవనాల్లోనే అసౌకర్యాల మధ్య సేవలందిస్తున్నాయి. ఇటీవల మంచిర్యాల కలెక్టరేట్ సమీపంలో ఈఎస్‌ఐ డిస్పెన్సరీ నిర్మాణం కోసం భూమి కేటాయించారు. కొత్తగా ఆదిలాబాద్ పట్టణం, మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ఆవరణలో కొత్త డిస్పెన్సరీలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. దీంతో సేవలు మెరుగవుతాయనే ఆశలు నెలకొన్నాయి.

ఈఎస్‌ఐ కార్డు ఉంటే..
ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులు చాలీచాలని జీతాలతో తమ కుటుంబాల వైద్య ఖర్చులకే రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోంది. నెలకు రూ.21వేల లోపు వేతనం పొందుతున్న ప్రతీ కార్మికుడు లేదా ఉద్యోగి ఈఎస్‌ఐకి అర్హులు. దివ్యాంగ ఉద్యోగులైతే రూ.25వేల వరకు అవకాశం ఉంది. ఈఎస్‌ఐ కార్డుతో ఉచితంగా వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. స్థానికంగా వైద్య పరీక్షలు చేయించుకుని సిఫారసుతో హైదరాబాద్‌తోపాటు దేశంలో ఎక్కడైనా ఈఎస్‌ఐ పెద్ద ఆసుపత్రిల్లో ఖరీదైన వైద్యం సైతం ఉచితంగా పొందవచ్చు. అలాగే ఈఎస్‌ఐ చెల్లిస్తున్న కార్మికులకు పని ప్రదేశాల్లో గాయపడిన, ఇతర ప్రమాదం ఏదైనా జరిగితే వేతనంతో కూడిన సెలవు, వైద్య ఖర్చులు పొందే అవకాశం ఉంటుంది. అయితే చాలామంది ఈఎస్‌ఐని ఉపయోగించుకోవడం లేదు. ఇక కొన్ని సంస్థలు తమ పరిధిలో పని చేస్తున్న కార్మికులకు కనీసం ఈఎస్‌ఐ కూడా చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాయి. ప్రైవేటు ఉద్యోగులు తప్పనిసరిగా ప్రతీ నెలా ఈఎస్‌ఐ చెల్లించేలా చూసుకోవాల్సిన అవసరం ఉంది.



మంచిర్యాల ఏసీసీ కాలనీలో అద్దె భవనంలో ఉన్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీ

అవగాహన లేక సేవలకు దూరం
ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఆయా రంగాల్లో పని చేస్తున్నారు. ప్రైవేటు విద్య, వైద్యారోగ్య సంస్థలు, మున్సిపల్, కార్పొరేషన్ సిబ్బంది, రవాణా, షాపింగ్ మాల్స్, ఫ్యాక్టరీలు, బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్, హోటల్స్, రెస్టారెంట్స్, సినిమా థియేటర్లు, తదితర చోట్ల కనీసం పది మంది పని చేసే చోట ఆయా యాజమాన్యాలు ఈఎస్‌ఐ పరిధిలోకి రావాల్సి ఉంది. అయితే చాలా చోట్ల ఇవేమీ అమలు కావడం లేదు. దీంతో అనేక మంది కార్మికులు తమ కష్టార్జితం వైద్యారోగ్య సేవలకే వెచ్చించాల్సి వస్తోంది. అయితే చాలామంది ఈ సేవలు పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకే వెళ్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో కార్మికులకు విస్తృతంగా ప్రచారం కల్పించి అర్హులు సేవలు పొందేలా చూడాల్సిన అవసరం ఉంది.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

నిర్మల్‌టౌన్: లోక్ అదాలత్‌లతో కేసులు త్వరగా పరిష్కారం అవుతాయని, సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టులో జాతీయ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణకుమార్ మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 06, ప్రీ లిటిగేషన్, బ్యాంకు సంబంధించిన కేసులు 96, క్రిమినల్ కేసులు 1,085, సైబర్ క్రైమ్ 1,220 కేసులు పరిష్కరించినట్లు వివరించారు. కార్యక్రమంలో జడ్జీలు రాధిక, శ్రీనివాస్, భవిష్య, పోలీస్ అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్

భైంసాలో 475 కేసులు..
భైంసాటౌన్: పట్టణంలోని ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జడ్జి అజయ్‌కుమార్ 475 కేసులు పరిష్కరించారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బెంచ్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సూపరింటెండెంట్, కక్షిదారులు పాల్గొన్నారు.



కేసులు పరిష్కరిస్తున్న జడ్జి అజయ్‌కుమార్

విద్యాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం



మహిళా దినోత్సవానికి హాజరైన మహిళా ఉపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: విద్యాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని డీఈవో రామారావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా శాఖ భవనంలో శనివారం వేడుకలు నిర్వహించారు. డీఈవో హాజరై మాట్లాడారు. తల్లిగా, చెల్లిగా, ఆలిగా, చైతన్య వంతురాలైన ఉపాధ్యాయురాలుగా మహిళలు ఎన్నో పాత్రలు పోషిస్తూ సమాజాభివృద్ధిలో, విద్యాభివృద్ధిలో కీలకంగా మారారన్నారు. మహిళలు సహనంతో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పడంలో ముందుంటారని తెలిపారు. పదో తరగతి పరీక్షలను ఎలాంటి ఒత్తిడి లేకుండా రాసే విధంగా సూచనలు ఇవ్వాలన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు డీఈవో జ్ఞాపికలు అందించి సత్కరించారు. వేడుకల్లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్, ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్, వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, తాళ్ల రవి, శ్రీదేవి, మీనాకుమారి, సుజాత, హేమలత, సౌజన్య, నీరజరాణి పాల్గొన్నారు.



క్యారమ్స్ ఆడుతున్న మహిళా ఉపాధ్యాయులు



మ్యూజికల్ చైర్ ఆడుతున్న మహిళా ఉపాధ్యాయులు

ఎదగని బాల్యం!

- వయసుకు తగిన బరువు, ఎత్తు లేని చిన్నారులు..
- జిల్లా వ్యాప్తంగా 791 మంది గుర్తింపు
- 176 మంది పిల్లల్లో పోషకాహార లోపం

లోకేశ్వరం: ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో అవసరం. ఎదిగే పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే సమతుల ఆహారం అందించాలి. ఇందు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలు, గుడ్లు, బాలామృతం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నాయి. అయినా పిల్లలు ఇంకా బలహీనంగానే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 791 మంది ఎత్తుకు దగ్గ బరువు, వయసుకు తగిన ఎత్తు లేరని, 176 మంది చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి.

జిల్లా వివరాలు..
జిల్లా వ్యాప్తంగా 926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఆరు నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 27,473 మంది, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 25,187 మంది ఉన్నారు. వీరిలో 967 మంది చిన్నారులు ఎత్తుకు తగిన బరువు లేకపోవడం, మరికొందరు వయసుకు తగిన ఎత్తు పెరగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో 4,765 మంది గర్భిణులు ఉండగా, బాలింతలు 5,051 మంది ఉన్నారు. వీరి ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకోవడంతోపాటు పుట్టిన శిశువు ఆరేళ్ల వయసు వచ్చే వరకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నాయి. అయినా వందల మంది చిన్నారులు పోషకాహారం లోపంతో బాధపడుతుండడం ఆందోళన కలిగించే అంశం.

వేధిస్తున్న సిబ్బంది కొరత ..
పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య కల్పతరువు అంగన్‌వాడీ కేంద్రాలు. అయితే ఈ కేంద్రాల్లోనే అనేక సమస్యలు ఉన్నాయి. ఒక్కో సెంటర్‌కు ఒక టీచర్, ఒక ఆయా తప్పనిసరిగా ఉండాలి. జిల్లావ్యాప్తంగా 926 కేంద్రాలకు 833 మంది టీచర్లు మాత్రమే ఉన్నారు. 93 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆయాలు 541 మంది మాత్రమే ఉన్నారు. ఇంకా 385 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముథోల్, భైంసా సీడీపీవో పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్నారు. చిన్నపిల్లలు కేంద్రాలకు రాకుంటే ఆయా ఇళ్లకు వెళ్లి కేంద్రానికి తీసుకురావాలి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెనూ ప్రకారం వంట చేసి పెట్టాలి. టీచర్ ఆట వస్తువులతో పిల్లలను ఆడిస్తూ పూర్వ ప్రాథమిక విద్యను బోధించాల్సి ఉంటుంది. సిబ్బంది కొరతతో లబ్ధిదారులకు పోషకాలతో కూడిన ఆహారం అందడం లేదు. అక్షరాలకు శ్రీకారం చుట్టే అంగన్‌వాడీ కేంద్రాలు చాలా వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఇరుకు గదులు, గాలి, వెలుతురు సరిగా లేకుండా, రేకుల షెడ్లు, పూరి గుడిసెల్లో కొనసాగుతున్నాయి. జిల్లా 926 కేంద్రాలకు ఉండగా వీటిలో పక్కగా భవనాలు కేవలం 194 ఉన్నాయి. 363 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 369 ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు.



ఎద్దూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువు చూస్తున్న సూపర్‌వైజర్ మీన (ఫైల్)

ప్రాజెక్టుల వారీగా పిల్లలు, అంగన్‌వాడీ ఖాళీల వివరాలు...

ప్రాజెక్టులు	6 నెలల నుంచి 6 ఏళ్ల పిల్లలు	బరువు తక్కువ ఉన్న పిల్లలు	పోషకాహార లోపం ఉన్న పిల్లలు	అంగన్‌వాడీ టీచర్ ఖాళీలు	ఆయా ఖాళీలు
నిర్మల్	21,152	318	46	36	140
భైంసా	11,764	152	34	27	67
ఖానాపూర్	11,350	221	75	14	104
ముథోల్	9,361	100	21	16	74
మొత్తం	53,627	791	176	93	385

ప్రత్యేక దృష్టి సారించాం
పోషకాహార లోపం, ఇతర సమస్యలతో ఎదగని చిన్నారుల కోసం ప్రత్యేక మెనూ కొనసాగిస్తున్నాం. నిబంధనల ప్రకారం 7 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలకు నెలకు 16 గుడ్లు మాత్రమే ఇస్తాం. కానీ ఎత్తుకు తగిన బరువు, వయసుకు తగిన ఎత్తు పెరగని చిన్నారుల కోసం ప్రతీరోజు గుడ్డు, బాలామృతం ప్లస్‌తోపాటు భోజనం అందిస్తాం. పది రోజుల కోసారి వైద్య సిబ్బందితో పరీక్షలు చేయిస్తున్నాం. ఆందోళనకరంగా ఉన్న పిల్లలకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం.
– ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ నిర్మల్

మహాలక్ష్మికి బోనాలు



తానూరు: మండలంలోని ఉమ్రి(కె) గ్రామంలోని మహాలక్ష్మి ఆలయం వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు శనివారం బోనాలు సమర్పించారు. భేరి చప్పుళ్లతో గజ్జెల లాగులు ధరించి నృత్యాలు చూస్తూ ఆలయం వద్ద భక్తులు సందడి చేశారు. అనంతరంగ్రామస్తులు బోనాలు ఎత్తుకుని డప్పు వాయిద్యాలతో మహాలక్ష్మి ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజలు చేశారు.

సెలవురోజూ విధులు

నిర్మల్: రెండో శనివారంతోపాటు మహిళా దినోత్సవం కావడంతో దాదాపు ప్రభుత్వ సిబ్బంది సెలవులోనే ఉన్నారు. కొంతమంది సెలవు రోజునా విధులు చేపట్టారు. చిన్నపిల్లల వైద్యురాలు మాత్రం సెలవు రోజు చిన్నారులకు వైద్యసేవలు అందించి మహిళా దినోత్స వం రోజున ప్రశంసలు పొందారు. నర్సాపూర్(జి) ప్రభుత్వ ఆస్పత్రిలో పిల్లల వైద్యురాలు స్వప్న రెండో శనివారం సైతం విధులకు వెళ్లి పసి పిల్లలకు అత్యవసర వైద్యం అందించారు.



పసిపిల్లలను పరీక్షిస్తున్న వైద్యురాలు స్వప్న

క్లుప్తంగా

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


గంగాధర్ (ఫైల్)

నర్సాపూర్(జి): అప్పుల బాధతో రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని గొల్లమాడలో ఈ ఘటన చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ఎండీ.జలాలుద్దీన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు నీరటి గంగాధర్ (44) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత రెండేళ్లుగా పంట సాగుచేస్తున్నాడు. సరైన దిగుబడి రాలేదు. పంట పెట్టుబడి కోసం ఇతరుల వద్ద రూ.2 లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లిస్తానో లేదో అని మనస్తాపం చెంది శనివారం గ్రామ శివారులోని వేపచెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య సవిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గణిత టీచర్ రిమాండ్

నర్సాపూర్(జి): పాఠశాల విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన గణిత ఉపాధ్యాయుడిని రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ పాఠశాలలో గతనెలలో విద్యార్థినుల పట్ల గణిత ఉపాధ్యాయుడు ఆలూరు మనోహర్‌రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుడు మోహన్‌రావు అసభ్యంగా ప్రవర్తించారు. వీరిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇద్దరు పరారీలో ఉన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో గణిత ఉపాధ్యాయుడు ఆలూరు మనోహర్‌రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఏఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న మోహన్‌రావు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఎద్దుదాడిలో వృద్ధుడి మృతి


సాయిలు(ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ పంచాయతీ పరిధి బుదుందేవ్‌నగర్‌కు చెందిన మక్కల సాయిలు (70) ఎద్దుదాడిలో మృతి చెందాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి సాయిలు దుకాణానికి నడుచుకుంటూ వెళ్తుండగా ఎద్దు దాడి చేసింది. గమనించిన స్థానికులు అతన్ని ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

నేటి నుంచి గ్లాకోమా వారోత్సవాలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9నుంచి 15వరకు నిర్వహించనున్న ప్రపంచ గ్లాకోమా వారోత్సవాల్లో భాగంగా బాధితులకు స్క్రీనింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని రిమ్స్, శేషన్న చెన్నావార్, మంచిర్యాల ప్రభుత్వ ఏరియాస్పత్రి, లయన్స్ కంటి ఆస్పత్రి బెల్లంపల్లి, నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రి, ముధోల్‌లోని గోపాల్‌రావు పటేల్ కంటి ఆస్పత్రుల్లో ఈ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. గ్లాకోమా రోగులు, 40 ఏళ్ల దాటినవారు తమ కళ్లను ఆయా ఆసుపత్రుల్లో పరీక్షలు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ దక్కేనా..!

- ఎమ్మెల్యే కోటా కాంగ్రెస్ అభ్యర్థిత్వంపై ఆశలు
- రేఖానాయక్, నరేశ్‌జాదవ్ ప్రయత్నాలు
- ఒకటి ఎస్టీకి కేటాయిస్తారనే ప్రచారం
- అధిష్టాన నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి


రేఖానాయక్, మాజీ ఎమ్మెల్యే


డా.నరేశ్‌జాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు

సాక్షి, ఆదిలాబాద్: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనే విషయంలో రాష్ట్రంలో అందరూ ఆసక్తిగా గమనిస్తుండగా, అందులో ఒకటి ఎస్టీ సామాజికవర్గానికి కేటాయిస్తామని పార్టీ చెబుతుందని ప్రచారం జరుగుతుండటం ఆసక్తి కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఇద్దరు నేతలు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, సీనియర్ నాయకుడు నరేశ్ జాదవ్ పదవీని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఇద్దరిలో ఎవరికైన దక్కుతుందా అనేది ఆసక్తిని కలిగిస్తోంది. ఆదివారం పార్టీ అభ్యర్థులను అధిష్టానం ఖరారు చేయనుండగా ఎవరికి దక్కుతుందని పార్టీ వర్గాలు ఎదురు చూస్తున్నాయి.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా కాంగ్రెస్‌కు నాలుగు స్థానాలు దక్కే అవకాశం ఉండటంతో అభ్యర్థుల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఒక స్థానాన్ని ఎస్టీ నుంచి భర్తీ చేసే యోచనలో పార్టీ ఉందని ప్రచారం నడుస్తోంది. అందులో మహిళగా మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌ను పార్టీ పరిశీలన చేస్తుందనే ప్రచారం లేకపోలేదు. మహిళా అభ్యర్థుల పరంగా రాష్ట్రంలో విజయశాంతితోపాటు రేఖానాయక్‌లో ఎవరికైన ఇవ్వవచ్చనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎస్టీ సామాజికవర్గంలో రేఖానాయక్‌ను పరిగణలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే విధంగా ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని ఉన్న తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఏఐసీసీ సభ్యుడు డా.నరేశ్‌జాదవ్ కోరుతున్నాడు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులను కలిసి తన ప్రాతినిధ్యం పరిశీలించాలని కోరారు. ఈ నేపథ్యంలో పార్టీ ఇద్దరి నేతల్లో ఎవరినైన ఆదరిస్తుందా అనేది ఎదురుచూడాల్సిందే.

లంబడాలు ప్రాతినిధ్యం కల్పించలేదనే..

ఉత్తర తెలంగాణ పరిధిలో గతంలో కాంగ్రెస్‌ని ఆదరించిన లంబడాలు క్రమంగా బీజేపీ వైపు వెళ్తున్నారని, ప్రధానంగా వారికి ప్రాతినిధ్యం కల్పించకపోవడంతోనే ఈ పరిస్థితి ఉందని ఆ పార్టీకి చెందిన ఆ సామాజికవర్గ నేతలు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికి పరిస్థితిలో మార్పు రాకపోతే పూర్తిగా దూరమవుతారని పార్టీకి హెచ్చరిస్తున్నారు. ఉత్తర తెలంగాణ నుంచి ఎస్టీ కోటాలో లంబడాల నేతలను ఎమ్మెల్యే కోటాలో అభ్యర్థిగా ఖరారు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆదివారం పార్టీ అభ్యర్థులను ప్రకటించనున్నారు. సోమవారం నామినేషన్ ప్రక్రియ జరగనుంది. ఈ నేపథ్యంలో ఇటు రేఖానాయక్, అటు నరేశ్‌జాదవ్ రాష్ట్ర ముఖ్య నేతలను కలుస్తూ ఎమ్మెల్సీ కేటాయించాలని కోరుతున్నారు. ఫలితం ఎలా ఉంటుందో చూడాల్సిందే.

పార్లమెంట్ నియోజకవర్గ పరిస్థితుల నేపథ్యంలో..

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే ఏడు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్‌కు ఖానాపూర్ ఎమ్మెల్యే ఒకరు మాత్రమే ఉన్నారు. మిగతా స్థానాల్లో నాలుగింటిలో బీజేపీ, రెండింటిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉండటంతో ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో హస్తం పార్టీకి అనుకున్న స్థాయిలో ఆదరణ లభించడం లేదని పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ నుంచి ముఖ్య నేతలు కాంగ్రెస్‌లో చేరగా, ఇప్పటి వరకు అనుకున్న స్థాయిలో ఫలితాలు లభించలేదన్న ప్రచారం లేకపోలేదు. అప్పట్లో పార్టీ పరంగా అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీచేసి ఓడిపోయిన వారే మిగతా నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలుగా ఉన్నారు. అధికారంలో ఉండటంతో సులువుగా పార్లమెంట్ స్థానాన్ని సాధిస్తామని అనుకున్నప్పటికి ఫలితం తారుమారైంది. ఈ స్థానంలో కమలం పార్టీ గెలుపొందడం కాంగ్రెస్ శ్రేణులకు నిరాశను కలిగించింది. తాజాగా పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీలో కాషాయం పార్టీకే ఆదరణ లభించింది. ఇలాంటి పరిస్థితిలో పార్లమెంట్ నియోజకవర్గంలో పార్టీకి జవజీవసత్వాలు కలిగించేందుకు పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేదీ కార్యకర్తలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల్లో ఇక్కడి నేతలకు ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

శ్రామిక మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలం

- ఐఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కామిల్ల జయరావు


కార్మిక మహిళలతో మాట్లాడుతున్న జయరావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రామిక మహిళలకు రక్షణ కలిపించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కామిల్ల జయరావు అన్నారు. శనివారం అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఆర్‌టీయూ, సీఐటీయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం హాజీపూర్ మండలం ముల్కల్ల ఇటుక బట్టీల వద్ద మహిళా కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, ఇటుక బట్టీ కార్మికులు లక్ష్మీ, మదునక్క, పద్మ, వెంకటమ్మ, పోచమ్మ తదితరులు పాల్గొన్నారు.

నగదు దొంగిలించిన వ్యక్తి అరెస్టు


స్వాధీనం చేసుకున్న నగదుతో ఏఎస్పీ

సోన్: నగదు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి, సొమ్ము రికవరీ చేసినట్లు ఏఎస్పీ రాజేష్ మీనా తెలిపారు. జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రానికి చెందిన సాకట్ యాదవ్ గత 12 ఏళ్లుగా సోన్ మండలం న్యూవెల్మల్ గ్రామానికి చెందిన సౌమ్య ఫెర్టిలైజర్ షాప్‌లో పనిచేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో షెటర్ తాళం పగులగొట్టి కౌంటర్‌లో రూ.96 వేలు దొంగతనం చేశాడు. శనివారం ఉదయం యజమాని గోల దయాసాగర్ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు ఐదు గంటల్లో కేసును ఛేదించారు. దొంగను పట్టుకుని సొమ్మును రికవరీ చేశారు. కేసు ఛేదించిన సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు గోపి, శ్రీకాంత్, సిబ్బంది భీమన్న, ముజమిద్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో మూడిళ్లు దగ్ధం


పరిశీలిస్తున్న సింగిల్ విండో చైర్మన్

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని ఆడదస్నాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మూడిళ్లు దగ్ధమైంది. ఇంట్లో నిత్యావసరాలు, వస్తువులు కాలి బూడిదయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ధరవత్ బలరాం, నాందేవ్ జమిందార్ ఇళ్లపై నుంచి విద్యుత్ వైర్లు ఉండగా రాత్రి సమయంలో గాలికి ఒకదానికి ఒకటి తగిలి మంటలు చెలరేగాయి. ఇంటి సమీపంలో గడ్డి వాముపై నిప్పు పడటంతో ఇళ్లకు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో ఓ ఎద్దు మృతిచెందింది. రెండు ఎడ్లకు గాయాలయ్యాయి. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్ శనివారం దగ్ధమైన ఇళ్లను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఖానాపూర్ అడవిలో కార్చిచ్చు


దగ్ధమవుతున్న అడవి

ఖానాపూర్: మండలంలోని సత్తన్‌పల్లి, అడవి సారంగాపూర్ తదితర గ్రామాల శివారులోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చుతో దగ్ధమవుతోంది. పలుచోట్ల భారీ వృక్షాలు, కలప దుంగలు కాలిబూడిదవుతున్నాయి. వేసవి ప్రారంభానికి ముందే పలుచోట్ల మంటలు రాజేసుకున్న సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మంటలకు విలువైన టేకు కలప వృక్షాలు దగ్ధంతో ప్రభుత్వానికి తీరని నష్టం వాటిల్లుతోంది. పలుచోట్ల ప్లాంటేషన్లకు నష్టం జరిగే అవకాశం ఉంది. జంతువుల మనుగడకు సైతం కార్చిచ్చుతో ముప్పు వాటిల్లే అవకాశం నెలకొంది. రోడ్డు పక్కనే పరిస్థితి ఇలా ఉంటే, అడవి ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉందో అనే విషయం చర్చనీయాంశంగా మారింది. అడవిలో రాలిన ఆకును శుభ్రపర్చే సిబ్బంది ఉన్న నిర్లక్ష్యంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఎఫ్ఆర్వో కిరణ్‌ను వివరణ కోరగా, సిబ్బందితో ఎప్పటికప్పుడు మంటలార్పే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

టైర్ పేలి లారీబోల్తా


బోల్తాపడ్డ లారీ


దెబ్బతిన్న బైక్

- గుడిహత్నూర్‌లో ఘటన
- డ్రైవర్ మృతి


డ్రైవర్ మురుగేశన్ మృతదేహం

గుడిహత్నూర్: లారీ టైర్ పేలి బోల్తా పడిన ఘటన మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. తమిళనాడులోని నమక్కల్ జిల్లాకు చెందిన లారీ దుస్తుల లోడ్‌తో వెళ్తోంది. మార్గమధ్యలో ఒక్కసారిగా టైరు పేలి పక్కనే నిలిచి ఉన్న ఐచర్ వాహనాన్ని ఢీకొట్టి అండర్‌ప్యాస్ పాస్ వద్ద రోడ్డుపై పడింది. దీంతో క్యాబిన్ నుజ్జునుజ్జయింది. అటు నుంచి వెళ్తున్న పలువురు, ఎన్పీడీసీఎల్ హెల్పర్ హన్మంతు, మధ్యప్రదేశ్‌కు చెందిన దుస్తుల వ్యాపారి వేర్వేరు బైక్‌లపై వస్తున్నారు. దుస్తుల వ్యాపారి బైక్‌పై పైనుంచి టైర్లు పడడంతో వాహనం ధ్వంసమైంది. ప్రమాదం జరిగిన క్షణంలో హెల్పర్ బైక్‌పై పడ్డ రివిట్‌మెంట్ బండలతో వాహనం దెబ్బతింది. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. నుజ్జునుజ్జయిన క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ మురుగేశన్ (49) బయటకు తీయించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ఈ ఘటన శుక్రవారం జరిగి ఉంటే పెను ప్రమాదంగా మారేది. అంగడి బజార్ సంత వల్ల ఈ ప్రాంతమంతా కిక్కిరిసిన జనాలతో ఉండేది. ఈ ప్రమాదం జరిగి ఉంటే పదుల సంఖ్యలో మృతి చెందేవారు. జాతీయ రహదారి నిర్మాణంలో జరిగిన లోపాల వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిపై నిత్యావసరాల కోసం లారీలను నిలపడం సైతం ఒక కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

యువతి అదృశ్యం

తానూరు: మండలంలోని జౌలా(బి) గ్రామానికి చెందిన బొడ్కర్ లక్ష్మి (18) అదృశ్యమైంది. ఏఎస్సై శ్యాముల్ కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో లక్ష్మి ఇంట్లో పనులు చేసేందుకు లేచింది. కొంతసేపు తర్వాత కుటుంబీకులు లేచి చూసేసరికి ఆమె కనిపించలేదు. చుట్టూపక్కల, బంధువుల వద్ద వెతికిన ఆచూకీ దొరకలేదు. తండ్రి సాయినాథ్ ఫిర్యాదుతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ఇస్రో పిలుస్తోంది!

- అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన
- తొమ్మిదో తరగతి విద్యార్థులకు అవకాశం
- యువికా కార్యక్రమానికి 23వ తేదీ తుది గడువు



యువికా లోగో

మంచిర్యాలఅర్బన్: అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో) ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ఏటా ఇస్రో యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)-25 పేరిట నిర్వహిస్తోంది. మే 19 నుంచి 30 ఈ కార్యక్రమం ఉంటుంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థులను ఆహ్వానిస్తోంది. మార్చి 23 తేదీలోపు www. isro. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు వడపోత అనంతరం ఏప్రిల్ 7న ఎంపికైన వారి జాబితా విడుదల చేస్తారు. తర్వాత 14 రోజులపాటు అవగాహన తరగతులు నిర్వహిస్తారు.

ఎంపిక ఇలా..

ఆయా పాఠశాలలో ప్రస్తుతం మార్చి 1, 2025 నాటికి తొమ్మిదో తరగతి చదువుతూ ఉండాలి. విద్యతోపాటు సహపాఠ్యాంశాలపై మంచి పట్టు ఉండాలి. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. స్పేస్, సైన్స్‌క్లబ్‌లో ఉంటే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం, ఎన్‌సీసీ స్కౌట్ అండ్ గౌడ్ విభాగంలో 5 శాతం, పల్లె ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం ప్రాధాన్యం ఇస్తారు.

ఎంపికైన విద్యార్థులకు..

ఇస్రో నిర్వహిస్తున్న యువికా కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం భోజనం, వసతి సౌకర్యాలు ఇస్రో ఉచితంగా అందజేస్తోంది. వారికి మే నెలలో 14 రోజుల పాటు ఇస్రో స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారు. అక్కడ స్పేస్‌కు సంబంధించి విశేషాలు, సప్తగ్రహ కూటమి, తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖీగా మాట్లాడే అవకాశం విద్యార్థులకు ఉంటుంది.

ఏడు కేంద్రాల్లో నిర్వహణ

ఇస్రో ఈకార్యక్రమాన్ని దేశంలో ఏడు కేంద్రాల్లో చేపడుతోంది. విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) తిరువనంతపురం, యూఆర్ఎస్ (ఎన్ఆర్ఎస్‌సీ) బెంగుళూరు, స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఎస్ఏసీ) అహ్మదాబాద్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ) హైదరాబాద్, ఈశన్యస్పేస్ అప్లికేషన్ సెంటర్(ఎన్ఈ-ఎస్ఏసీ) శిల్లాంగ్, ఎస్‌డీఎస్‌సీ శ్రీహరికోట, ఐఐఆర్ఎస్ డెహ్రాడూన్‌లో అవగాహన తరగతులు నిర్వహిస్తోంది.

విద్యార్థులకు అవకాశం



యువికా ద్వారా విద్యార్థులకు చక్కటి అవకాశం కల్పిస్తోంది. 150 మందికి అవగాహన తరగతులు నిర్వహిస్తారు. నిపుణులు, శాస్త్రవేత్తలతో అంతరిక్ష విజ్ఞానంపై బృందచర్చ, ప్రాక్టికల్ ఫీడ్ బ్యాక్ తరగతులు చూపిస్తారు. ఆయా పట్టణాల్లో ఇస్రో ప్రయోగ కేంద్రాలు, ప్రయోగశాలలను చూపిస్తారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మధుబాబును సంప్రదించాలి.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

రక్తహీనతతో బాలింత మృతి

ఉట్నూర్‌రూరల్: ఓ వైపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్న వేళ ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతంలో నెల రోజుల బాలింత రక్తహీనతతో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని ఉడుంపూర్ గ్రామానికి చెందిన భగవంత్‌రావు- శ్రీవిద్య దంపతులు ఉపాధి నిమిత్తం ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీవిద్య నెలక్రితం రిమ్స్‌లో పాపకు జన్మనిచ్చింది. ప్రసవ సమయంలో రక్తహీనతతో బాధపడగా చికిత్స అనంతరం ఆమెను ఇటీవల ఇంటికి పంపారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఆరోగ్యం క్షీణించి లక్కారంలో మృతి చెందింది. తల్లి మృతి అనంతరం పసికందు గుక్కపెట్టి ఏడుస్తున్న హృదయవిదారక దృశ్యం పలువురిని కంటతడి పెట్టించింది. బాలింత మృతి విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పసికందుకు పాలు అందించే బాధ్యత తాను తీసుకుంటానని తెలిపారు.

అంతర్రాష్ట్ర చైన్‌స్నాచర్ల అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి: నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో చైన్‌స్నాచింగ్, బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గతేడాది డిసెంబర్ 12న బోర్గాం(పి)కి చెందిన దుమాల లక్ష్మిబాయి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు బైక్‌పై వచ్చి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేసినట్లు తెలిపారు. నాల్గో టౌన్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలోని బృందం నిందితుల కోసం గాలింపు చేపట్టిందన్నారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన షేక్ ఇమాన్ అలియాస్ అబ్బు, షేక్ అర్బాజ్ అలియాస్ మాయా నిర్మల్ జిల్లా బాసరలోని శారదానగర్‌లో నివసిస్తూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకొని మూడు గొలుసులు, బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. నిందితులపై నాల్గో టౌన్ పీఎస్, మాక్లూర్, నిర్మల్ జిల్లా బాసరలో చైన్ స్నాచింగ్‌లు, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో బైక్‌ల చోరీ కేసులు నమోదైనట్లు తెలిపారు. ఇదిలా ఉండగా నాందేడ్ జిల్లాకు చెందిన మరో నిందితుడు అమన్ అలియాస్ అమన్‌పటేల్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ చెప్పారు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్ల అరెస్టు

- ఏడు బైక్‌లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్లను అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. నిర్మల్ కేంద్రంగా ఉండే ఇద్దరు మైనర్లు ఆరు నెలలకోసారి ఆదిలాబాద్‌కు వస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. బైక్‌లతోపాటు నేరడిగొండ, ఇచ్చోడ ఆలయాల్లోనూ చోరీలు చేశారు. శనివారం ఉదయం లాండసాంగ్వీ ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. విచారించగా ఏడు బైక్‌లను దొంగలించినట్లుగా అంగీకరించారు. వారి వద్ద ఉన్న రెండు బైక్‌లు, ఏరోడ్రమ్‌లో ఉంచిన మరో ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. గతంలో వీరిపై అనేక కేసులు నమోదై ఉన్నాయన్నారు. వీరితోపాటు పెన్‌గాహన్‌తో మరో మైనర్ బాలుడు కలిపి నలుగురు చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. వన్‌టౌన్ పరిధిలో ఐదు, టూటౌన్, మావల స్టేషన్ల పరిధిలో ఒక్కో బైక్‌ను దొంగలించినట్లుగా ఆయన వెల్లడించారు. చాకచక్యంగా వీరిని పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు. సమావేశంలో సీఐలు సునీల్ కుమార్, కరుణాకర్‌రావు, ఫణీదర్, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కంచె ప్రాణం తీసింది

- పంట రక్షణకు వెళ్లి..విద్యుత్ తీగలకు తగిలి రైతు మృతి


గంగాధర్ మృతదేహం

తానూరు: విద్యుత్ కంచె ఓ రైతు ప్రాణం తీసింది. అడవి జంతువుల బారి నుంచి పంట రక్షణ కోసం వెళ్లి కరెంట్ తీగలకు తగిలి మృతిచెందాడు. మండలంలోని మహలింగి గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏఎస్సై శ్యాముల్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు తురాటి గంగాధర్ (60) వ్యవసాయం చేస్తుంటాడు. అడవి జంతువుల బారి నుంచి పంటను రక్షించేందుకు విద్యుత్ కంచె తీగలు ఏర్పాటు చేసుకున్నాడు. శుక్రవారం చేనులో పంట రక్షణ కోసం వెళ్తున్నానని కుటుంబీకులకు చెప్పి బయల్దేరాడు. రాత్రి ఇంటికి తిరిగిరాలేదు. శనివారం ఉదయం వారు చేనులో వెళ్లి చూసేసరికి విద్యుత్ కంచె తీగలకు తగలి విగతజీవిగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భార్య గంగామణి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ కృషి


కాసిపేట గనిపై మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ కృషి చేస్తుందని సంఘం బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 1గనిపై శనివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. గుర్తింపుసంఘం ఏఐటీయూసీ, సీఅండ్ఎండీతో జరిగిన స్ట్రక్చర్ సమావేశంలోని అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గని ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ నాయకులు తదితరులున్నారు.

బెల్లంపల్లి: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తమ సంఘం ముందంజలో ఉందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు అన్నారు. మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై శనివారం జరిగిన గేట్ మీటింగ్‌లో నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో సింగరేణి యాజమాన్యంతో జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు తీవ్రంగా చర్చించి 14డిమాండ్లకు అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలిపారు. కార్మిక వర్గ ప్రయోజనాలను కాపాడటానికి ఎర్రజెండా యూనియన్ ఎంతటి పోరాటాలకైన ముందుంటుందని ప్రకటించారు. సమావేశంలో శాంతిఖని గని ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరి మంతెన రమేష్, నాయకులు పి.రాజలింగు, మిట్టపల్లి రమేష్, ఆర్.ప్రవీణ్, దాడి రమేష్, సంతోష్‌కుమార్, రామకృష్ణ, ఫక్రుడా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.